ప్రజాశక్తి
ఆదివారం 9 ఏప్రిల్ 2023
శ్రీకాకుళం

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి: జెసి

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన జెసి నవీన్

శ్రీకాకుళం అర్బన్: పదో తరగతి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జెసి ఎం.నవీన్ అన్నారు. జిల్లాలో 149 పరీక్షా కేంద్రాల్లో సుమారు 29 వేల మంది విద్యార్థులు పరీక్షకుల హాజరవుతున్నారని చెప్పారు. నగరంలోని కేశవరెడ్డి పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. తాగునీరు, వైద్య సౌకర్యం, తదితర సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు ఆయనకు వివరించారు. ఇన్విజిలేటర్, చీఫ్ సూపరింటెండెంట్‌లకు జాయింట్ కలెక్టర్ పలు సూచనలు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పరీక్షలు సజావుగా జరిగేలా యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

19న 'పోర్టు'కు శంకుస్థాపన

- జిల్లాకు రానున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి
- మూలపేట గ్రామస్తుల త్యాగాలు మరువలేనివి
- ఎస్ఇజెడ్‌కు భూసేకరణ ప్రతిపాదనలు
- మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈ నెల 19న మూలపేట వద్ద భావనపాడు పోర్టుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని, భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. భావనపాడు పోర్టు నిర్మాణంలో ఈ ప్రభుత్వంతో పాటు, తానూ భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. నేరడి బ్యారేజీ పూర్తికావడానికి ముందు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా హిరమండలం రిజర్వాయరును పూర్తి కెపాసిటీని చేసేందుకు ఇటీవల చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. భావనపాడు పోర్టు కల సాకారం కావడంలో రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషి ఎంతైనా ఉందని, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ పోర్టు వద్ద ఎస్ఇజెడ్ నిర్మాణం కోసం భూసేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. పోర్టు నిర్మాణంలో కొందరు పూర్తిగా, మరికొందరు పాక్షికంగా నష్టపోవాల్సి వస్తుందని, అయినప్పటికీ వారికి ఎక్కడా లేనివిధంగా ఎకరాకు రూ.25లక్షలు వంతున గౌరవమైన ప్యాకేజీ ఇస్తున్నామని తెలిపారు. స్పీకరు తమ్మినేని సీతారాం మాట్లాడుతూ ఆమదాలవలస నియోజకవర్గంలో ఎనిమిది మండలాలను కలుపుతూ నిర్మిస్తున్న బలసలరేవు వంతెనకు 19న జగన్ శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మడ్డువలస ఫేజ్-2 పనులకు పరిపాలనపరమైన అనుమతులు లభించాయని, 18న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.

అందని పరిహారం

ఆందోళనలో భావనపాడు పోర్టు నిర్వాసితులు

ప్రజాశక్తి - నౌపడ

నిర్వాసిత గ్రామాలైన మూలపేట, విష్ణుచక్రం గ్రామస్తులకు పరిహారం ఇంకా పూర్తిస్థాయిలో అందనే లేదు. ఇప్పటివరకు వ్యవసాయ భూములు మాత్రమే అవార్డులు గుర్తించి ఎకరాకు రూ25 లక్షలు చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. అదీ మరో 20 నుంచి 30శాతం మందికిపైగానే చెల్లించాల్సి ఉంది. అలాగే గ్రామంలో ఉన్న జీడీ, మామిడి తోటలకు పరిహారం చెల్లించాల్సి ఉంది. సెంటుకు రూ.2,500 చొప్పున చెల్లిస్తారని సమాచారం. ఈ రెండు గ్రామాల్లో 400 పైచిలుకు ఇళ్లతోపాటు, 587 పిడిఎఫ్‌లను అధికారులు గుర్తించారు. ఒక్కో పిడిఎఫ్‌కు ఆర్అండ్ఆర్ కాలనీలో నూతన గృహ నిర్మాణ సొమ్ముతో కలిపి రూ.9,91వేలు చెల్లించనున్నారు. దీన్ని మరో రెండు లక్షలు పెంచాలని సర్పంచ్ బాబురావు ఇటీవల ముఖ్యమంత్రిని కలిపి విన్నవించారు. అదీ ఇంతవరకు చెల్లించలేదు. అదీ కాకుండా ఇంటి నిర్మాణాన్ని బట్టి విలువ కట్టారు. వాటి విలువ ఎంతో నిర్వసితులకు సమాచారం లేదు. పశువుల సాలలకు చెల్లింపులో స్పష్టత లేదు. వీటన్నింటికీ ఇంకా పరిహారం అందజేయాల్సి ఉంది.

నిర్వాసితుల్లో ఆందోళన

మూలపేట, విష్ణుచక్రం గ్రామస్తుల పునరావాస కాలనీకి నౌపడలో 60 ఎకరాలను రైతులు వద్ద నుంచి సేకరిస్తున్నారు. ఈ భూములకు ఎకరాకు రూ.26 లక్షలు చొప్పున నష్టపరహారం అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఆ పరిహారం భూములు ఇచ్చిన రైతులకు ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి. అలాగే పోర్టు వద్దకు నౌపడ మీదుగా టెక్కలి 16వ నెంబర్ జాతీయ రహదారిని అనుసంధానం చేసే స్పీడ్ యాక్సిస్ రోడ్డుకు భూ సేకరణ ప్రక్రియ చేపట్టారు. దీనికి నౌపడకు చెందిన రైతులకు ఎకరాకు రూ.25 లక్షలు చెల్లిస్తామని చెప్పారు. ఇదే రోడ్డు నిర్మాణంపై టెక్కలి మండలంలో రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. రైతులు రోడ్డుకు భూములు ఇవ్వడానికి నిరాకరిస్తుండటంతో అధికారులు డైలమాలో పడ్డారు. ఇటీవల కొందరు రైతులు టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తలగాం, టెక్కలి, ఆయోధ్యపురం పిఠాపురం, బన్నువాడ, మోదుగువలస, వేములవాడ, విశ్వనాథపురం రైతులు సమావేశమై కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంలో సిఎం పోర్టు నిర్మాణానికి 19న శంకుస్థాపన చేయనున్నారు. దీంతో రైతులు, అధికారుల్లో ఆందోళన ప్రారంభమైంది.

మూలపేటలో బహిరంగసభ నిర్వహించనున్న స్థలం ఇదే

మరోవైపు పోర్టుకు అనుసంధానం చేసే రైలు మార్గం నౌపడ పంచాయితీ కూర్మనాథపురం, యామలపేట మీదుగా దండు గోపాలపురం వరకు రైల్వే లైన్ నిర్మించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయా గ్రామస్తులతో గ్రామసభ నిర్వహించి భూసేకరణ చేస్తున్నట్లు ప్రకటించారు. వారి భూములకు పరిహారం ఎంత చెల్లిస్తారో స్పష్టత ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి పరిహారం లేకుండా ప్రారంభ ఏర్పాట్లు చేస్తుండడంపై నిర్వాసితులతో పాటు, ప్రజలలో ఓ రకమైన అయోమయం, ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై అధికారులు ఏమి స్పష్టత ఇస్తారో తెలియాల్సి ఉంది.

సన్నాహాల్లో అధికారులు

మూలపేటలో భారీ బహిరంగసభ సభా ప్రాంగణాన్ని సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యాన తహశీల్దార్ చలమయ్య రెవెన్యూ అధికారులతో కలిసి సిద్ధం చేస్తున్నారు. హెలీప్యాడ్‌కు అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నారు. విష్ణు చక్రంలో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు.

మాట్లాడుతున్న గోవిందరావు

14 నుంచి 'ప్రచార భేరి'

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14వ తేదీ నుండి 30 వరకు ప్రచార భేరి నిర్వహిస్తున్నామని, దీన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో సైకిల్ యాత్రలు, పాదయాత్రలు, సభలు సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఇంటింటికీ కరపత్రాల ద్వారా ప్రచారం చేయనున్నట్లు చెప్పారు. దేశాన్ని, వనరులను దోచుకుంటున్న మోడీ, షా, అదానీ త్రయం మోదాని దోపిడిపైన, కేంద్ర ప్రభుత్వ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14 అంబేద్కర్ జయంతి సందర్భంగా రాజకీయ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు. మోదానీ త్రయం చేస్తున్న దోపిడీ, దుర్మార్గాలు, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం, ప్రజల ఆస్తులు, సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టడంపై ప్రజలకు వివరించేందుకు సిపిఎం, సిపిఐ ఉమ్మడిగా రాజకీయ 'ప్రచార భేరి' నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం పార్లమెంటులో ప్రజాస్వామ్యం గొంతు నొక్కి భావప్రకటన స్వేచ్ఛను అణచివేస్తున్నారని చెప్పారు. రాహుల్ గాంధీకి చిన్న కేసులో రెండు సంవత్సరాల శిక్ష పడితే, దాన్ని అడ్డుపెట్టుకొని ఆయన సభ్యత్వాన్ని రద్దుచేసి ప్రతిపక్షాలపై బెదిరింపు చర్యలకు దిగారని విమర్శించారు. మోదానీ ఆక్రమాలపై పార్లమెంటులో చర్చ జరుగుతుందని. అయినా లక్ష కోట్ల కుంభకోణంపై ప్రధాని మోడీ నోరెత్తడం లేదని తెలిపారు. అన్ని ప్రతిపక్ష పార్టీలూ అదానీ అవినీతిపై చర్చకు పట్టుబడుతున్నా ప్రధాని ఇప్పటివరకు నోరెత్తకపోవడం అంటే దేశానికి ఏ సందేశం ఇస్తున్నారని వారు ప్రశ్నించారు. అవినీతిలో భాగం లేదని గానీ, తమకు సంబంధం లేదని చెప్పలేకపోతున్నారని విమర్శించారు. బిజెపి మతోన్మాదంపై వైసిపి, టిడిపి, జనసేన నాయకులు నోరెత్తడం లేదని, మోడీని చూసి భయపడుతున్నారా? అని వారు ప్రశ్నించారు. అవినీతిపై అన్ని ప్రతిపక్షాలు పార్లమెంటులో పోరాడుతుంటే వైసిపి, టిడిపి ఎంపీలు చేతులు కట్టుకొని కూర్చున్నారని, ఇది రాష్ట్రానికి అవమానమని వారన్నారు. దీనిపై ప్రజలకు సంజాయి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కె.నాగమణి, ఎల్.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితం చిత్తు

డిఎస్‌పి మహేంద్ర
డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎస్‌పి మహేంద్ర

మాదక ద్రవ్యాలు యువత జీవితాలను చిత్తు చేస్తున్నాయని, ఈ జాడ్యం ప్రైవేట్ పాఠశాలలు, స్కూళ్లకు సైతం పాకడం ఆందోళన కలిగిస్తోందని శ్రీకాకుళం డిఎస్‌పి ఎం.మహేంద్ర అన్నారు. నగరంలోని ఉమెన్స్ కళాశాలలో జెసిఐ శ్రీకాకుళం సన్ రైజర్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రోటరీ క్లబ్, ఇండియన్ పెడియాట్రిక్స్ అస్సోసియేషన్ సంయుక్తంగా మత్తు పదార్థాల వాడకాన్ని వ్యతిరేకిస్తూ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. డిఎస్‌పి మహేంద్ర మాట్లాడుతూ చాపకింద నీరులా వ్యాపిస్తున్న డ్రగ్స్ మాఫియాపై ఇప్పటికైనా ఉక్కుపాదం మోపకపోతే యువత భవిష్యత్ అంధకారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు.. చివరికి బానిసగా మార్చుకుంటుందని తెలిపారు. డ్రగ్స్ కోసం నేరాలు చేసేందుకు కూడా బాధితులు వెనకాడడం లేదని అన్నారు. స్నేహితులు, బాంధవ్యాలను మరిచి ఒంటరిగా కుంగిపోయి.. చివరికి ఆత్మహత్యలకు దారితీయొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారని వివరించారు. ట్రాఫిక్ డిఎస్‌పి ప్రసాద్ మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడ్డవారు మొదట్లో స్టైల్ కోసం తీసుకునే వారే ఉంటున్నారని, ఆ తరువాత అప్పుడప్పుడు దానిని టేస్ట్ చేస్తూ నెమ్మదిగా అలవాటు చేసుకుంటున్నారని చెప్పారు. కొందరు మధ్యలోనే మానుకొని బయటపడుతున్నా.. మరికొందరు మాత్రం మత్తు ఊబిలో చిక్కి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. జెసిఐ అధ్యక్షులు డాక్టర్ కూర్మాన వినోద్, చిన్నపిల్లల వైద్యనిపుణులు ధర్మాన లక్ష్మీనారాయణ, కొంచాడ సోమేశ్వరరావు మాట్లాడుతూ యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలవుతూ వారి కుటుంబాలను తీరని క్షోభకు గురిచేస్తున్నారన్నారు. జెసిఐ ఎల్ఓ అడ్వైజర్ గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ మత్తు సమాజానికి చేటు అని, దాని జోలికి పోవద్దని కోరారు. విద్యాలయాల్లో యువతకు కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరారు. అనంతరం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల, విజయ్ నర్సింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల విద్యార్థులతో ఉమెన్స్ కళాశాల నుంచి సూర్యమహల్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి, ప్లకార్డులతో డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాములు, మంత్రి వెంకటస్వామి, సంతోష్ దూసి, వెంకట సతీష్, ప్రవీణ్ , వడ్లపాటి శిరీష, బగాది వెంకట్, మీనా కుమారి, వైద్యులు మందుల మోహన్‌రావు, డాక్టర విజయ్‌కుమార్, ఐ.శిరీష, నరేష్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై ముందస్తు చర్యలు

ఇళ్ల నిర్మాణంపై అలసత్వం వద్దు
స్పీకర్ సీతారాం, మంత్రి అప్పలరాజు
ప్రజా సమస్యలను ఏకరువుపెట్టిన సభ్యులు

మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వేసవి దృష్ట్యా జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో జెడ్‌పి చైర్‌పర్సన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలను ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ టి.శ్రీనివాస్ ప్రసాద్ వివరించారు. ఉద్దానం ప్రాజెక్టు పనులు శరవేగంగా చేస్తున్నట్లు చెప్పారు. 38 గ్రామాల్లో నీటిఎద్దడి ఉందని గుర్తించి, సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కొవ్వాడలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని రణస్థలం జెడ్‌పిటిసి టి.సీతారాం సమావేశం దృష్టికి తెచ్చారు. స్పందించిన జెసి నవీన్ స్వయంగా తానే పరిశీలిస్తానని అన్నారు. టెక్కలిలో మంచినీటి పథకం పూర్తయినా నీరు ఇవ్వడం లేదని జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. సంతబొమ్మాళి మండలంలో తాగునీటి ఎద్దడి ఉందని కళింగ కార్పొరేషన్ చైర్మన్ తిలక్ అన్నారు.

క్షేత్రస్థాయిలో కనీసం రెండు గంటలైన ఉపాధి హామీ పనులు జరగడం లేదని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పేరాడ తిలక్, జెడ్‌పిటిసిలు సీతారాం తెలిపారు. డ్వామా పీడీ చిట్టిరాజు స్పందిస్తూ ఉపాధి పనుల కల్పనలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. సగటున 60 నుండి 65 రోజుల పనిదినాలు కల్పించడంలో జిల్లా తృతీయ స్థానంలో నిలిచిందన్నారు.

సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

వంశధార నిర్వాసితులకు పరిహారం

వంశధార నిర్వాసితుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు నష్టపరిహారం చెల్లింపుల్లో ఇప్పటికీ కొందరికి మంజూరు కాలేదని హిరమండలం జెడ్‌పిటిసి పి.బుచ్చిబాబు లేవనెత్తారు. స్పందించిన జెసి నవీన్ మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.148 కోట్ల బిల్లులు చెల్లింపులు చేశామని, మిగిలినవి సిఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు.

ఇళ్ల బిల్లుల చెల్లింపుల్లో జాప్యం

లబ్ధిదారులు నిర్మించిన ఇళ్లకు బిల్లులు చెల్లించడం లేదని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, రణస్థలం, జి.సిగడాం జెడ్‌పిటిసిలు టి.సీతారాం, రమణ అన్నారు. దీని వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని చెప్పారు. పీడీ ఎన్.గణపతి మాట్లాడుతూ 2023 మార్చి 31వరకు నిర్మించిన గృహాలకు చెల్లింపులు చేశామన్నారు. జిల్లాలో 38,157 గృహాలు ప్రభుత్వ స్థలాల్లో, 36,497 గృహాలు సొంత స్థలం కలిగిన వారు నిర్మిస్తున్నారని చెప్పారు. తక్కువ స్థలం అన్న నిబంధన చూపించి పేదలకు అన్యాయం చేయడం తగరదని, అవసరమైన మేరకు వెసులుబాటు ఇవ్వాలని మంత్రి అప్పలరాజు సూచించారు.

శివారు భూములకు అందని నీరు

వంశధార ఎడమ కాల్వ ద్వారా శివారు భూములకు సాగునీరు అందటం లేదని మంత్రి సీదిరి అప్పలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఈ పరిస్థితికి కారణం ఏమిటో చెప్పాలని ఎస్ఇ డోల తిరుమలరావును నిలదీశారు. కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయని, యుబిల వద్ద సమస్య ఎదురవుతోందని, షట్టర్లు, కాపలాదారులు లేక శివారు భూములకు నీరు ఇవ్వలేకపోతున్నామని తిరుమలరావు చెప్పారు. ఈ సమస్యలను ఎస్ఇ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు.

డిఆర్‌డిఎలో అవినీతిపై ప్రశ్నించిన స్పీకర్

జిల్లాలో పెరటి కోళ్ల పెంపకానికి మహిళలపై ఒత్తిడి తెచ్చి సుమారు రూ.15కోట్లు వసూలు చేశారని, మార్కెట్‌లో ఇస్తున్న ధర కంటే యూనిట్ ధర అధికంగా వసూలు చేయడంలో ఎవరి ప్రమేయం ఉందని స్పీకర్ సీతారాం ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను డిఆర్‌డిఎ ఆధ్వర్యాన నిర్వహించారని, వాటికి పౌరసరఫరాల సంస్థ నుంచి వస్తున్న నిధులు ఏమయ్యాయో చెప్పాలని ప్రశ్నించారు. పీడీ విద్యాసాగర్ వివరణ ఇస్తుండగా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రి అప్పలరాజు, స్పీకరు తమ్మినేని సీతారాం జెసి నవీన్‌కు సూచించారు.

తీర్మానాలివే..

జిల్లాలో టూరిజం, సెజ్ ఏర్పాటులో భాగంగా శాలిహుండం బుద్ధిస్టిక్ సర్క్యూట్ ఏర్పాటుకు అధికారులు ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాలని, పారిశ్రామిక అభివృద్ధి కోసం, జిల్లాలో రణస్థలం, పైడి భీమవరం మధ్య, 5వేల ఎకరాల్లో సెజ్ ఏర్పాటుకు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆమదాలవలస మున్సిపాలిటి పరిధిలో సర్వే నెంబరు 133/7ని సలాన్ని టిటిడి కళ్యాణ మండపం నిర్మాణానికి కేటాయిస్తూ సభ్యులు తీర్మానాన్ని ఆమోదించారు.

సమావేశంలో పాలవలస విక్రాంత్, కె.జోగులు, కె.రాజేశ్వరరావు, మామిడి శ్రీకాంత్, కె.నర్సింగరావు, దుక్క లోకేశ్వరరావు, హేమామాలినీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అసహనమా? అభద్రతాభావమా?

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమో లేక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, పార్టీ అధిష్టానంపై అంతర్గతంగా నెలకొన్న అసంతృప్తి ప్రభావమో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు నోట వస్తున్న మాటలు బ్యాలెన్స్ తప్పుతున్నాయి. రాజకీయ ప్రసంగాల్లో మునుపెన్నడూ లేనివిధంగా జనాన్ని తిట్టిపోయడం, శాపనార్థాలు పెట్టడం ఇటీవల కాలంలో తరుచూ కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం సందర్భంగా నిర్వహిస్తున్న సమావేశాల్లో ధర్మాన చేస్తున్న వ్యాఖ్యలు చర్చనీయాంశమవుతున్నాయి. వైసిపికి ఓటేయకపోతే చేతులు నరుక్కున్నట్లేనని శాపనార్థాలు పెట్టారు. శ్రీకాకుళం రూరల్ మండలంలో నిర్వహించిన మరో సభలో మగవాళ్లు పోరంబోకు తిరుగులు తిరుగుతుంటే మహిళలు కష్టపడి పని చేస్తున్నారంటూ వ్యాఖ్యానించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఆసరా డబ్బులు జగన్ ఇంట్లో నుంచి డబ్బులు ఇస్తున్నారా అని తన తోటి మహిళలతో అన్న మాటలపై మరో సమావేశంలో లబ్ధిదారులను అవమానపరిచేలా మాట్లడటంతో మహిళలు నొచ్చుకున్నారు. ధర్మాన వ్యాఖ్యలపై సొంత పార్టీ నాయకులూ ఆశ్చర్యపోతున్నారు. ప్రసంగాల్లో కొంత హుందాతనంగా వ్యవహరించే తమ నాయకుడు నోరు జారి విమర్శలు పాలవ్వడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ధర్మాన మాటలతో కొన్ని సెక్షన్లు దూరమవుతాయేమోనన్న ఆందోళన పార్టీ వర్గాల్లో కనిపిస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రభుత్వానికి, తద్వారా పార్టీకి ఇమేజ్ తీసుకురావాలన్న లక్ష్యంతోనే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధిష్టానం రూపొందించింది. ధర్మాన వ్యాఖ్యలతో పార్టీకి ఇమేజ్ కంటే డ్యామేజే ఎక్కువగా జరిగేటట్లు ఉందన్న చర్చ జనంలో సాగుతోంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత అమాత్యునిలో అభద్రతాభావం పెరిగినట్లుగా కనిపిస్తోంది. ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా జనం ఆదరించడం లేదన్న అక్కసు అమాత్యుని మాటల్లో వ్యక్తమవుతోంది. పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటేసినవారు ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందుతున్న జనం వేసిన ఓట్లు కావని, ఫలితాలు ప్రభుత్వ పనితీరుకు శాంపిల్స్ కావని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కొట్టి పారేసినా ధర్మానకు మాత్రం పరిస్థితి కొంత అర్థమైనట్లుగా కనిపిస్తోంది. ఓట్లేసిన వారు పట్టభద్రులైనా వారేమి కుటుంబాల నుంచి సెపరేట్‌గా లేరనేది వాస్తవం. ఏదైనా ఒక పథకం కింద లబ్ధిపొందుతున్న కుటుంబాలకు చెందిన వారు కూడా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థిని ఓడించారంటే దాన్ని ప్రభుత్వంపై వ్యతిరేకతగానే చూడాలి. మంత్రి ధర్మానకు ఈ తత్వం బోధపడినట్లుంది. రాబోవు ఎన్నికల్లో గెలుపుపై కొంత అభద్రతా భావం కూడా నెలకొన్నట్లు కనిపిస్తోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో జనం తిరస్కరించడం నుంచి వచ్చిన అసహనమే ఈ రకంగా బయట పడుతోందన్న చర్చ నడుస్తోంది. ఎన్నికల సందర్భంలోనే కాదు సాధారణ రోజుల్లోనూ ప్రభుత్వంపై జనంలో ఉన్న వ్యతిరేకత ఆయా సందర్భాల్లో బయటపడుతూనే ఉంది. గతంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో పలు నియోజకవర్గాల్లో అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ నిలదీసిన సందర్భాలు చూశాం. ఆమదాలవలస, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఇవి కనిపించాయి. ముఖ్యంగా ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల్లో నిలదీతలు, నిరసనల పర్వం ఎక్కువగా సాగింది. తాజాగా ప్రభుత్వం ప్రారంభించిన 'జగనన్న నువ్వే మా భవిష్యత్'లోనూ అదే పునరావృతమవుతున్నట్లు కనిపిస్తోంది. ఈ నెల 7వ తేదీన జిల్లాలో రెండు చోట్ల నిలదీతల పర్వం ప్రారంభమైంది. పలాస మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఇంటింటికీ వెళ్తున్న క్రమంలో కిషోర్ అనే వ్యక్తి పెరాలసిస్‌తో బాధపడుతున్నా తనకు ఆసరా లేదని, పెన్షన్ కోసం గత ఆరు నెలలుగా మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోయిందంటూ మంత్రి అప్పలరాజు వద్ద మొరపెట్టుకున్నారు. బాధితుడి ఆవేదనకు సమాధానమివ్వకుండానే అక్కడ నుంచి నిష్క్రమించారు. టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి శ్రీనివాసనగర్ కాలనీలో గడచిన కొద్ది నెలలుగా రేషన్ బియ్యం అందడంలో జరుగుతున్న అవకతవకలపై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసుని ఆ ప్రాంత మహిళలు అడ్డుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చేశామంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు ఓ వైపు గొప్పలు చెప్పుకుంటుంటే మరోవైపు తమ సమస్యలు పరిష్కారం కాలేదంటూ జనం నిలదీస్తున్నారు. ఇప్పటివరకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్తున్న ఎమ్మెల్యేలకు స్థానికులు వేస్తున్న ప్రశ్నలతో సమాధానం చెప్పలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తాజాగా ప్రభుత్వం తలపెట్టిన 'జగనన్న నువ్వే భవిష్యత్' కార్యక్రమం మరో 14 రోజులు పాటు సాగనుంది. అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులంతా జనంలోనే ఉండాల్సి ఉంటుంది. జగనన్న నువ్వే భవిష్యత్ మాట ఎలా ఉన్నా ఎమ్మెల్యేల భవిష్యత్ ఎలా ఉండబోతుందో చూడాలి. ఓ వైపు గడప గడపకూ మన ప్రభుత్వం, మరోపక్క జగనన్న నువ్వే భవిష్యత్ కార్యక్రమాలతో రాబోవు రోజులు వారికి పరీక్షగా మారనున్నాయి.

భూ ఆక్రమణలకు అడ్డుకట్ట పడేనా?

- రూ.3 కోట్ల స్థలం కబ్జాకు యత్నం
- లబోదిబోమంటున్న బాధితులు
- తెరవెనుక అధికార పార్టీ నాయకులు

వివాదాస్పద స్థలం ఇదే

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గలో భూ అక్రమాలకు అడ్డు, అదుపు లేకుండా పోతోంది. వీటిని నివారించే వారు లేకపోవడంతో హద్దులు మీరి భూకబ్జాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అటు రెవెన్యూ యంత్రాంగం, ఇటు అధికార పార్టీ చూసీచూడనట్లు వివరించడంపై జంట పట్టణాల్లో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.3 కోట్లు విలువ చేసే స్థలాన్ని ఆక్రమించేందుకు తెరవెనుక నుంచి అధికార పార్టీ నాయకులు అండదండలు పుష్కలంగా అందిస్తుండగా.., మరోవైపు వైశ్య కులానికి చెందిన వ్యక్తులు తాము ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఆ స్థలం కొనుగోలు చేసామని చెబుతుంటే.., మరి కొందరు నకిలీ డాక్యుమెంట్ సృష్టించి ఆ స్థలంపై తమకు హక్కు ఉందని చెబుతుండడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 60/1లో సుమారు 20 సెంట్లు జిరాయతీ స్థలంతో పాటు ప్రభుత్వ కాలువ ఉంది. పలాసకు చెందిన నిచ్చర్ల అప్పలస్వామి, మల్లా లక్ష్మిబాయి 1979లో ఈ స్థలాన్ని కొనుగోలు చేశారు. వీరి వద్ద అదే ఏడాది స్థలాన్ని కొనుగోలు చేశామని కొంచాడ జయలక్ష్మి, కొంచాడ విశ్వనాథం చెప్తున్నారు. మరోవైపు పలాసకు చెందిన ఇప్పిలి సరస్వతి, టి.కృష్ణారావు నకిలీ డాక్యుమెంట్ సృష్టించి మా అధీనంలో స్థలం ఉందని, ఎప్పటికప్పుడు స్థలం వద్దకు చేరుకొని, రచ్చ చేస్తున్నారు. దీంతో కొంచాడ జయలక్ష్మి, కొంచాడ విశ్వనాథం ఆ స్థలంపై పలాస, సోంపేట కోర్టును ఆశ్రయించగా కోర్టు జిరాయతీ స్థలమని తీర్పు చెప్పిందని బాధితులు చెబుతున్నారు. దీనిపై ఇప్పిలి సరస్వతి, టి.కృష్ణారావు కోర్టును ఆశ్రయించగా కోర్టునే మరలా అదే తీర్పును వెలువరించింది. ప్రస్తుతం బాధితులు 2023లో హైకోర్టును ఆశ్రయించామని చెబుతున్నారు. అయితే కొంత మంది దళితులను స్థలం వద్దకు తెచ్చి తెర వెనుక నుంచి వైసిపి నాయకులు భూకబ్జాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ ఆ స్థలం జిరాయతీదారులు, మరోవైపు ఆక్రమణదారులు తమ స్థలం అంటే తమ స్థలం అని గొడవ పడడం గమనార్హం. ఆ స్థలంపై ఇటీవల పలాస మున్సిపల్ కార్యాలయంలో మంత్రి సీదిరి అప్పలరాజు నిర్వహించిన రెవెన్యూ దర్బార్‌లో బాధితులు, ఆ ప్రాంత వాసులు, ఆక్రమణదారులు ఫిర్యాదు చేయడం కొసమెరుపు.

నా దృష్టికి వచ్చింది

ఆ స్థలంపై జరుగుతున్న వివాదం నా దృష్టికి వచ్చింది. సర్వే నెంబర్ 60/1, 22/7 లోని జిరాయతీ స్థలం, ప్రభుత్వ కాలువ పక్క పక్కనే ఉండడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఆ స్థలాలను సర్వే చేయించి ప్రభుత్వ స్థలం, జిరాయతీ స్థలం ఎంతెంతో ఉందో గుర్తించి రాళ్ల పాతాలని దిగువ స్థాయి అధికారులను ఆదేశించాం.

-ఎల్.మధుసూదనరావు,
తహశీల్దార్, పలాస

సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

గడప గడపకు సంక్షేమం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

గడప గడపకు సంక్షేమ పథకాల వెల్లువలా కొనసాగుతుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని 22వ వార్డు లక్ష్ముడుపేటలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరు తెన్నులను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధృఢ సంకల్పంతో ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో ప్రజాదరణ పొందుతుందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి సత్వర పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. విద్య, వైద్యం, సేద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ముందుకు వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, మున్సిపల్ సచివాలయాల కో-ఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరావు, మాజీ కౌన్సిలర్ దుంపల చిరంజీవి, సంపదరావు రామారావు, బొడ్డేపల్లి రమణమూర్తి, మామిడి రమేష్, పొదుగు శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రాజు, మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, ఎఇ.అప్పలనాయుడు, సృజన, ఎపిఎం పైడి కూర్మారావు, హౌసింగ్, విద్యుత్, టిడ్కో ఎఇలు పాల్గొన్నారు.

పిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి- జలుమూరు

పర్యవేక్షిస్తున్న లక్ష్మీతులసి

వ్యాధి నిరోధక టీకాలను ఫ్రిజ్‌లో జాగ్రత్తపర్చాలని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ లక్ష్మీతులసి ఆరోగ్య సిబ్బందికి సూచించారు. జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గొల్లపేట, చల్లవానిపేట సచివాలయ పరిధిలో చేపడుతున్న సార్వత్రిక వ్యాధినిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాలను శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే వేసవి తీవ్రత దృష్ట్యా వ్యాధి నిరోధక వ్యాక్సిన్ శీతలీకరణ సామర్థ్యం (కోల్డ్ చైన్ సిస్టం) తగ్గకుండా చూసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకుంటున్నది? లేనిది? వాకబు చేశారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలోనూ ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ మాత్రల నిల్వలు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ స్వాతి, హెల్త్ విజిటర్ లలితాంబ, ఎఎన్ఎంలు ఆదిలక్ష్మి, సంతోషి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి'

రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. జగనన్నే మా భవిష్యత్... మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మండలం లోని కొండములగాంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి స్టిక్కరింగ్‌లను అంటిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ అన్న ప్రజా నినాదం అని అన్నారు. ప్రతి పేదవాడి అవసరాలను గుర్తించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాల్లో ఉన్న పేదలకు చేయూతను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, జెసిఎస్ మండల ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి దాయపరెడ్డి బుజ్జి, సర్పంచ్ మంజులాదేవి, ఎంపిటిసి రెడ్డి లక్ష్మి పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక కుమ్మరివీధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి చేపట్టారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి జగనన్న స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పడల లక్ష్మణరావు, ఎంపిటిసి జి.రత్నకుమారి, ఉప సర్పంచ్ జద్దు మహాలక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, వై.సి.పి.నాయకులు జి.ఆనందరావు, ఎల్.తిరుపతిరావు, తోట కిరణ్‌కుమార్, ఎల్.జనార్దన్, బి.శ్రీను, పి.రామారావునాయుడు, సాధుబాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని కవిటి, భైరిపురం పంచాయతీల్లో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, పూడి నీలాచలం ఎఎంసి ఉపాధ్యక్షుడు యలమంచి నీలయ్య, సర్పంచ్ పుల్లట రమాదేవి, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, నాయకులు బెందాలం రమణమూర్తి, దుర్గి ధర్మారావు, పిన్నింటి జయరాం, పుల్లట ప్రభాకరరావు పాల్గొన్నారు. జగనన్నను ముఖ్యమంత్రి గా చెయ్యాలి

లావేరు : మండలంలోని వెంకటాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు లుకలాపు అప్పలనాయుడు, సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు, మాజీ సర్పంచ్‌లు గొర్లె రామినాయుడు, ఎస్.నాగరాజు, పి.సూర్యారావు, పతివాడ గురునాయుడు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని గోవిందపురంలో సర్పంచ్ రెయ్య రామి రెడ్డి ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో వైసిపి నాయకులు రెయ్యి ప్రసాద్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ కంబాల ఈశ్వర్‌రెడ్డి, పీస పాపారావు, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్లలో నిర్వహించిన కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షుడు పైల వెంకటరావు (బిల్లి) సర్పంచ్ బాడాన పుష్ప, ఎంపిటిసి తుంగాన రమణమ్మ, మండల సచివాలయ కన్వీనర్ దువ్వాడ రవికుమార్, లక్ష్మీపురం ఎంపిటిసి గొండు మోహనరావు, పాల్గొన్నారు. అలాగే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సర్వీసుపురంలో మా భవిష్యత్ నువ్వే జగనన్న కార్యక్రమంలో పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దబ్బీర్ భవానీశంకర్, మున్సిపాలిటీ సచివాలయం కన్వీనర్ బడగల బల్లయ్య, కౌన్సిలర్ పిచ్చుక అజయ్ పాల్గొన్నారు.

కొత్తూరు : స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఆమదాలవలస: మండలంలోని యలమంచిలి పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు రొణంకి ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు, హేమసుందరరాజు, అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, గొద్దు చింతబలి, ఎస్.వినోద్, ఎంపిటిసి హనుమంతు గోవిందరావు

కోటబొమ్మాళి: మండలంలోని ఆల్లాడలో ఎంపిపి వాన గోపి ఆధ్వర్యాన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్మోహనరావు, మండల సంపూర్ణరావు పైడి విశరిల్లా, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు దామ మన్మథరావు, ముఖ్యాడ శ్యామలరావు, మురళి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని మలకాం, తండ్యాం, బాణాం, దళ్లిపేట గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, పొందూరు సర్పంచ్ రేగడి లక్ష్మి, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, జి.సూర్యారావు, సర్పంచ్‌కంబాపు నీలవేణి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలో మర్రిపాడు-కె, చాపర పంచాయతీల్లో నిర్వహించిన కార్యక్రమంలో పి.అప్పారావు, బి.రామారావు, శ్యామల బాబు, పి.వెంకట్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను నూతన విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పట్టణ ప్రాంత ప్రజలపై ఇప్పటికే తీవ్ర భారంగా మారిన ఆస్తి పన్ను నూతన లెక్కింపు విధానాన్ని రద్దు చేసి సహేతుక విధానం అమలు చేయాలని, చెత్త పన్ను రద్దు చేయాలని శ్రీకాకుళం టాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మన భాస్కర్, మణికొండ ఆదినారాయణమూర్తి అన్నారు. నగరంలోని ఆపోపా కళ్యాణ మండపంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021 మార్చి 31 నాటికి రూ.వెయ్యిగా ఉన్న ఆస్తి పన్ను... ఏటా కాంపౌండింగ్ పద్ధతిలో 15 శాతం పెరగడంతో ప్రస్తుతం రూ.1520 అయ్యిందన్నారు. మరో రెండేళ్లకు రెట్టింపును దాటి రూ.2010కు చేరుతుందన్నారు. కేవలం ఎనిమిది ఏళ్ల కాలంలోనే మూడు రెట్లు పై స్థాయికి చేరుకుంటుందన్నారు. ప్రస్తుతం ఆస్తి విలువలో 0.15 శాతంగా ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారని, దీనిని ఇంకా ఎక్కువ శాతంగా మార్పుదల చేయడానికి చట్టంలో అవకాశం పుష్కలంగా ఉన్నాయని అన్నారు. వాణిజ్య భవనాలకు మరింత అదనంగా భారం వేసే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్టాంప్ ఫీజు రూపంలో తన ఆదాయం పెంచుకోవడానికి తరచుగా ఆస్తి విలువలు పెంచుతోందన్నారు. ఆస్తి విలువ ఆధారిత ఆస్తి పన్ను పెంపుదల నిరంతర ప్రక్రియగా మారిపోతోందన్నారు. ప్రజలకు నష్టదాయకంగా ఉన్న ఆస్తి పన్ను నూతన లెక్కింపును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే మూడేళ్లలో రూ.4114కు చేరుతోందన్నారు. మళ్లీ చెత్త పన్ను అంటూ వసూలు చేయడం డబుల్ టాక్స్ అవుతుందన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణ చెపుతున్నా...

మాట్లాడుతున్న ఆదినారాయణమూర్తి

వాటిని పట్టించుకోకపోవడం, కేంద్రాన్ని నిలదీయలేక ప్రజలపై పెను భారాలను రాష్ట్ర ప్రభుత్వం మోపుతుందని అన్నారు. పెను భారాలను వ్యతిరేకిస్తూ అసోసియేషన్ ఆధ్వర్యాన వేలాది సంతకాలు సేకరించి అధికారులకు అందజేశామన్నారు. అనేక మంది వ్యక్తిగతంగా లేఖలు రాశారని, సచివాలయాలు, మున్సిపాలిటీ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించామని తెలిపారు. అలాగే మంత్రులకూ వినతిపత్రాలు అందజేశామన్నారు. తక్షణమే పెంపుదల నిర్ణయాలను మానుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి బిఆర్‌నగర్ ఫీడర్ పరిధిలో రోడ్ క్రాసింగ్ వద్ద మరమ్మతులకు గురైన స్తంభాల స్థానంలో కొత్తవి వేస్తున్నామని అన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వన్ వే కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం, రైల్వేస్టేషన్, లక్ష్మీనగర్ స్కూల్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

పరామర్శిస్తున్న కృపారాణి

కృపారాణి పరామర్శ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కోటబొమ్మళి మండలం దుప్పలపాడు పంచాయతీ కొప్పలపేకు చెందిన టెక్కలి ఎంపిటిసి-2 కూన పార్వతి అత్త కూన మల్లమ్మ (90) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మృతురాలి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. సందర్భంగా మల్లమ్మ మృతి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా మల్లమ్మ చిత్రపటానికి పూలమాలనేసి నివాళ్లర్పించారు. ఈమెతో పాటు డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, ఎంపిటిసి ప్రతినిధి సత్తారు సత్యం, టి.బి.జి.గుప్త, సర్పంచ్ గురువెల్లి ప్రకాశరావు, గోరంటి కృష్ణారావు ఉన్నారు. అలాగే కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేడాడ తిలక్ కూడా పరామర్శించారు. ఈయనతో పాటు పాటు నందిగామ ఎంపిపి నడిపూరు శ్రీరామ్మూర్తి, కో-ఆపరేటివ్ ప్రెసిడెంట్ ఎం.బాలకృష్ణ, చిన్న జోగారావు, సర్పంచ్ గురువెల్లి ప్రకాశరావు ఉన్నారు.

తోటల్లో తిరుగుతున్న నెమళ్లు

పుక్కళ్లపాలెంలో నెమళ్ల సంచారం

కవిటి: మండలంలోని పుక్కళ్లపాలెంలోని తీర ప్రాంతం సబుకు తోటల్లో నెమళ్లు సంచరిస్తున్నాయి. శనివారం ఉదయం సబుకు తోటలో నెమళ్లు సంచరిస్తుండగా గమనించిన స్థానికుడు వాటిని వీడియో తీసేందుకు ప్రయత్నించగా, అవి తోటలోకి వెళ్లిపోయాయి. అయితే మన దేశ జాతీయ పక్షి అయిన నెమళ్లు ఇలా యథేచ్ఛగా సంచరిస్తున్నా అటవీశాఖకు తెలియకపోవడం పలు సందేహాలకు తావిస్తోంది. ఇప్పటికైనా జాతీయ పక్షి నెమళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది వాటిని రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

అంధకారంలో రాష్ట్రం

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనుభవరాహిత్యంతో రాష్ట్రం అప్పుల ఊబిలోకి, అంధకారంలోకి కూరుకుపోయిందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన టిడిపి సానుభూతుపరుల కుటుంబాలను శనివారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఏమి అభివృద్ధి చేశారని ఇంటింటికీ స్టిక్కర్లు అంటిస్తున్నారని అన్నారు. జగనన్న భవిష్యత్ కాదని, అంధకారమని ప్రజలు అంటున్నారని అన్నారు. అనంతరం లోలుగులో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాద బాధితుడు పొట్నూరు సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయనతో పాటు తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, టిడిపి నాయకులు లోలుగు కామరాజు, చోళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని డొంకలపర్తలో ఇటీవల టిడిపి కార్యకర్త జడ్డు పార్వతి మృతి చెందింది. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అల్లెన, కోణంపేట గ్రామాల్లో పర్యటించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలన అంతా బాటకమన్నారు. జగనన్న మీ నమ్మకం కార్యక్రమం ఏం చేశారని ప్రజలను కలుస్తున్నారని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. ఈయన వెంట టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వి.రాంజీ, లంక జగన్నాథ్‌నాయుడు, కోడి గోవిందరావు, జడ్డు కృష్ణ, టెంకల బెనర్జి, కె.పాలయ్య, అంపిలి గణపతరావు, బి.స్వామినాయుడు, జె.చిన్నంనాయుడు, కె.బాలరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గౌతు శిరీష

టిడిపి పూర్వ వైభవానికి కృషి

ప్రజాశక్తి- పలాస

టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీ పిలుపునిచ్చారు. పలాస టిడిపి కార్యాలయంలో శనివారం పలాస నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ముందుగా టిడిపి సీనియర్ నాయకులు, ఎంపిటిసి మాజీ సభ్యులు దువ్వాడ శ్రీనివాస్ ఇటీవల మృతి చెందడంతో సంతాపం వ్యక్తం చేశారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వైసిపి నాయకుల అరాచకాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వాటికి ధీటుగా టిడిపి నాయకులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జిల విధులు కీలకమని పేర్కొన్నారు.

ప్రతి బూత్ పరిధిలో హౌస్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేసేందుకు నాయకత్వం చొరవ తీసుకోవాలని సూచించారు. ఇంకా పూర్తి కాని ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ముందుకు వెళ్లాలని కోరారు. మహానాడు కార్యక్రమానికి విస్తృతంగా హాజరయ్యేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బాబూరావు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి విఠల్, వసంతస్వామి, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, నవీన్, దుర్యోధన, రుద్రయ్య, మోహనరావు, గాలి కృష్ణ, సురేష్, శశిభుషణ్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులను అందజేస్తున్న ఈశ్వరరావు

దుస్తుల పంపిణీ

లావేరు : గిరిజనుల అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం కృషి చేస్తుందని బిజెపి ఎచ్చెర్ల నియోజకవర్గ కన్వీనర్ నడుకుదిటి ఈశ్వరరావు అన్నార. సామాజిక న్యాయ వారోత్సవాలలో భాగంగా మండలంలోని జి.జి.వలస లో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు ఇజ్జాడ శ్రీనివాస రావు శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గిరిజన మహిళలకు, వృద్ధులకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.వి.రత్నం, పతివాడ అప్పలనాయుడు, గురాల రఘునాథ్, దన్నాన రాజేంద్ర, ఎంపిటిసి టొంపల సంజీవిరావు పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలు పంపిణీ

ఇచ్ఛాపురం : మండలంలో మండపల్లి పంచాయతీ భవానీపురం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఐరన్, విటమిన్ల మాత్రలను కార్యకర్త నరసమ్మ శనివారం పంపిణీ చేశారు. చిన్నారులు ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రభుత్వం అందించిన ఐరన్ మాత్రలను అందజేసిందన్నారు. పిల్లల ఎదుగుదల విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సందేశాత్మక చిత్రాలు అవసరం

కవిటి : ప్రస్తుత పరిస్థితుల్లో సమాజానికి సందేశాత్మక చిత్రాలు అవసరమని, అటువంటి ప్రయత్నం చేసిన మజ్జి పురుషోత్తం అభినందనీయుడని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఉద్దానం ప్రాంతంలో ప్రస్తుత సమస్యలపై సొంతంగా కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహిస్తూ పురుషోత్తం నిర్మించిన ఎస్‌జిఎఫ్ సినిమా మంచి సందేశాత్మక చిత్రంగా నిలిచింది. దీంతో పురుషోత్తం ఎమ్మెల్యే అశోక్‌ను రామయ్య పుట్టుగలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా పురుషోత్తంకు దుశ్శాలువ కపి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సినిమా అంటే ఎంతసేపు నాలుగు ఫైట్లు, నాలుగు పాటలకే పరిమితమవుతున్న ప్రస్తుత రోజుల్లో సమాజం కోసం, భవిష్యత్ తరాల కోసం ఆలోచించి సందేశాత్మక సినిమా తీయడం ఓ విధంగా సాహసం చేయడమేనని అన్నారు. పురుషోత్తం భవిష్యత్‌లో మరిన్ని మంచి చిత్రాలు తీయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాలం రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాడి సహదేవ్, పద్మనాభం, మణి, నరేంద్ర, ఎస్‌జిఎఫ్ చిత్ర బృందం పాల్గొన్నారు.

పురుషోత్తంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అశోక్

పరీక్షా కేంద్రం పరిశీలన

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను డిఇఒ గార పగడాలమ్మ శనివారం పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒ అప్పారావు, సిఆర్‌పిలతో సమావేశం నిర్వహించారు. ఈ నెలలో వస్తున్న జగనన్న విద్యా కానుక వస్తువులను భద్రపరచాలన్నారు. పురుషోత్తపురం ఉన్నత పాఠశాలలోని ఓ గదిలో వస్తువులను ఉంచాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎపిఒ తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న డిఇఒ పగడాలమ్మ

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

శ్రీకాకుళం అర్బన్ : అమరావతి జెఎసి పిలుపు మేరకు కొన్ని రోజులుగా ఉద్యోగులు చేస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం నగరంలోని అంబేద్కర్ కూడలిలో ఉన్న విగ్రహం వద్ద నల్లకండువాలను దరించి నిరసన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. న్యాయసమ్మతమైన కోర్కెల సాధనకు ప్రభుత్వశాఖల్లో ఉన్న ఉద్యోగులంతా సమిష్టిగా ఉద్యమించాలని అమరావతి జెఎసి జిల్లా సెక్రటరీ జనరల్ వెంకటరమణ పిలుపునిచ్చారు. ఉద్యోగులకు పెన్షన్‌దారులకు ప్రతినెలా ఒకటిన జీతాలు, పెన్షన్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి సిపిఎస్‌ని రద్దు చేసి పాత ఒపిఎస్‌సిని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణరావు, ఎపిఆర్ఎస్ఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పి.శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి.వి.ఎన్.రాజు, వైస్ ప్రెసిడెంట్ డి.పద్మావతి, శ్రీకాకుళం డివిజన్ సెక్రెటరీ డి.ప్రకాశరావు, ఎపిజిడబ్ల్యుసిఒ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎస్.గోవిందరావు, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

టిడిపి నాయకులవే శవ రాజకీయాలు

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని వి.ఆర్.గూడెం అక్రమ గ్రావెల్ క్వారీలో గత నెల 31న సంభవించిన సంఘటనలో శవాన్ని మాయం చేయాలని ప్రయత్నించి దొరికిపోయిన టిడిపి నాయకులే శవ రాజకీయాలను చేస్తున్నారని ఎంపిఇప కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్‌లు ఆరోపించారు. పొందూరు వైసిపి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమ గ్రావెల్ క్వారీలో జరుగుతున్న అవినీతి బాగోతం బయటపడుతుందనే భయంతో శవాన్ని మాయం చేయాలని చూశారని అన్నారు. 40 ఏళ్ల అనుభవం, పూర్తిస్థాయిలో అవగాహన ఉన్న స్పీకర్ తమ్మినేని సీతారాంను విమర్శించే స్థాయి టిడిపి మండల నాయకులకు లేదన్నారు. ఈ అక్రమ గ్రావెల్ క్వారీ సంఘటనలో ఉన్న వారు మా పార్టీవారు కాదని, అక్కడ క్రషర్ తనకు సంబంధం లేదని కూన రవికుమార్ సమాధానం చెప్పి తన సచ్ఛీలతను నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కొండపై సంఘటన జరిగినప్పటి నుంచి రెవెన్యూ, మైనింగ్ అధికారులు సర్వే చేస్తున్నారని, తాము చేసిన అవినీతి అంతా బయటకు వస్తుందని భయంతో ఈ విధంగా శవ రాజకీయాలు అంటున్నారని అన్నారు. అక్కడ శవ రాజకీయాలకు తెరలేపినిది టిడిపి నాయకులే అన్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, పొందూరు సర్పంచ్ రేగడి లక్ష్మి, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, గొర్లె సూర్యారావు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

నిందితుడిని ప్రవేశపెడుతున్న పోలీసులు

ఆన్‌లైన్ మోసగాడు అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన దంత వైద్యులు సుజాత రెడ్డి ఫిర్యాదు మేరకు నైజీరియా గ్యాంగ్‌కు చెందిన ఆన్‌లైన్ మోసగాడు కులావత్ సింగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సిఐ ఈశ్వర్‌చంద్ర ప్రసాద తెలిపారు. ఈ మేరకు శనివారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఆగస్టు నెలలో సుజాత రెడ్డి ఆన్‌లైన్‌లో అపరిచితుడితో పరిచయం ఏర్పడిందన్నారు. ఆ పరియం కాస్త ప్రేమగా మారిందన్నారు. కులావత్‌సింగ్ తనకు అత్యవసర ఆపరేషన్ అవుతుందని, డబ్బులు కావాలని సుజాతరెడ్డిని అడిగారని అన్నారు. దీంతో ఆమె ఆయనను నమ్మిన ఎనిమిది అకౌంట్లలో రూ.22.80 లక్షలు చెల్లించిందన్నారు. తిరిగి డబ్బులు అడిగితే అదిగో ఇదిగో అంటూ నెట్టుకొచ్చాడని తెలిపారు. అనంతరం ఫోన్ కాకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. దీనిపై క్రైమ్ బృందం విచారణ చేపట్టిందన్నారు. ఈ దర్యాప్తులో అకౌంట్ల లావాదేవలపై విచారణ చేపడుతున్న సమయంలో చివరి లావాదేవీ అకౌంట్ నంబరు లభించిందన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ఢిల్లీ వెళ్లి అక్కడ తిలక్ నగర్‌లో కులవత్ సింగ్‌ను అరెస్టు చేశామని తెలిపారు. నైజీరియాకు చెందిన ఈ గ్యాంగ్ ఈ విధంగా ఆన్‌లైన్‌లో లాగిన అయిన అందులో పరిచయం పెంచుకుని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. కొత్త సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒటిపి నంబరు ఎవరికీ చెప్పకూడదన్నారు. ఇటువంటి సందర్భంలో డబ్బులు పోగిట్టుకుంటే వెంటనే 1930 నంబరుకు డయల్ చేయాలన్నారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ.గోవిందరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో సచివాలయ ఉద్యోగి దుర్మరణం

ప్రజాశక్తి- కవిటి

అందివచ్చిన కొడుకు ఇక తమకు అందదని, జీవితాంతం ఇక వాడి జ్ఞాపకాలతోనే జీవించాలన్న తలంపే వారి గుండెలను పిండేస్తోంది. కొడుకు మృతదేహాన్ని చూస్తూ ఆ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అక్కడున్నవారి కళ్లల్లో నీళ్లు తెప్పించింది. మండలంలోని బెజ్జిపుట్టుగ సచివాలయంలో ఎనర్జీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివంగి వాసు (28) శనివారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందాడు.

వాసు మృతదేహం

పోలీసులు, స్థానికుల కథనం మేరకు... వాసు బెజ్జిపుట్టుగ పంచాయతీ పెద్దకర్రివానిపాలెంలో విద్యుత్ పనులు నిర్వహిస్తుండగా షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు కవిటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తమలా తమ పిల్లలు కూలి పనులు చేయకూడదని, సమాజంలో వారు మంచి గౌరవంతో జీవించాలనే లక్ష్యంతో రెక్కలు ముక్కలు చేసుకుని తమ పిల్లలను చదివించారు తల్లిదండ్రుల చెందిన శివంగి లచ్చయ్య, రాములమ్మ దంపతులు. తల్లిదండ్రుల కష్టాన్ని చిన్నప్పటి నుంచి చూస్తూ పెరిగిన పిల్లలు శివంగి వాసు, శివంగి బాలకృష్ణ అంతే కష్టపడి చదివారు. నాలుగేళ్ల క్రితం సచివాలయం పరీక్షలో వాసు సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్‌గా ఎంపికై బెజ్జిపుట్టుగ సచివాలయంలో పనిచేస్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. బాలకృష్ణ ఇటీవల డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. ఇంతలోనే ఈ ఘోరం జరిగి వాసు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బల్లిపుట్టుగకు చెందిన బచ్చల శేఖర్ (39) శుక్రవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని ఎస్ఐ కె.రాము తెలిపారు.

శేఖర్ మృతదేహం

మండలంలోని బల్లిపుట్టుగ పంచాయతీ ఎలమంచిపుట్టుగ - చిన్న బల్లిపుట్టుగ రోడ్డు మధ్యలో శనివారం ఉదయం రుద్రయ్య మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లో శేఖర్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. విశాఖలో కూలి పనులు చేసుకునే శేఖర్ మార్చి 4న గ్రామానికి వచ్చినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం రాత్రి 8 గంటల వరకు ఇంటి దగ్గరే ఉన్న శేఖర్ తరువాత బయటకు వెళ్లి తిరిగి రాలేదని, శనివారం ఉదయం గ్రామస్తుల ద్వారా తమకు ఈ సమాచారం అందిందని తెలిపారు. మృతుడి భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాము కేసు దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి దీక్షిత్ (9), వైష్ణవి(7) ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువతి అదృశ్యం

ప్రత్యూష

టెక్కలి : టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి అక్కపు వీధికి చెందిన గుంటముక్కల ప్రత్యూష అదృశ్యమైనట్లు తల్లితండ్రులు తారకేశ్వరరావు, కళ్యాణి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని, చుట్టుపక్కల, బంధువులు ఇళ్లల్లో వెతికినా ఫలితం కనబడకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా 'రన్ ఫర్ జీసస్'

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ పెట్రోల్ బంక్ వద్ద నుంచి క్రైస్తవ సోదరులు డాక్టర్ జోషప్ ఆధ్వర్యాన నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అలప్పరాజు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం, పలాస ప్రభుత్వాసుపత్రి కమిటీ చైర్మన్ భవానీశంకర్, ఇరిగేషన్ డైరెక్టర్ సవర జగన్నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : మానవాళి పాప, శాప విమోచనానికి రేపు (ఆదివారం) మళ్లీ సజీవుడై యేసు రానున్న నేపథ్యంలో శనివారం నగరంలో రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని చర్చి ఫాస్టర్లు, క్రైస్తవ సంఘాలు నిర్వహించారు. డాక్టర్ కృపానందం స్థానిక సిడబ్ల్యుసి చర్చి నుంచి కీ స్టోన్ చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెవరెండ్ జాన్ జీవన్, రెవరెండ్ శామ్‌సన్, డిఎల్‌బిఎల్ కుమార్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : మున్సిపాలిటీ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యాన రన్ ఫర్ జీసస్ భాగంగా ఫైఓవర్ బ్రిడ్జి దగ్గరనుంచి కృష్ణాపురం కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వైసిపి నాయకులు అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, జె.వెంకటేశ్వరరావు, ఎస్ఐ వై.కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ జి.కృపావరం, గౌరవ అధ్యక్షులు ఆర్.ఆనందరావు, నియోజకవర్గ ఫాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు జార్జ్ మల్లాల్, సిజెఎసి అధ్యక్షులు రాడ విజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పద్రక్, సెక్రెటరీ శ్యామ్, ట్రెజరర్ స్టీవెన్, సైమన్, పవిత్ర కుమార్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని రన్ ఫర్ జేసెస్ పేరుతో క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. గుడ్ ఫ్రైడే తరవాత వచ్చే శనివారం నాడు క్రీస్తు పునరుద్ధరణ పేరుతో స్థానిక సూరంగ రాజా కోట నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో కుమార్, ప్రత్తి విజయకుమార్ డి.ఎలియా, సుందరరాజ్, ప్రవీణ్, బెహరా, దుక్క లోకేశ్వరరావు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

ప్రజాశక్తి - ఆమదాలవలస

నవధాన్యాలు సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి నక్క చిరంజీవి అన్నారు. ప్రాజెక్టు జిల్లా మేనేజర్ రేవతి ఆదేశాల మేరకు మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లాడ, కొత్తవలస జీకే వలస తొగరాం గ్రామాల్లో నవధాన్య విత్తనాలను మహిళా సంఘాల్లోని రైతులకు శనివారం అందజేశారు. అనంతరం వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. కొంతమంది రైతులతో నవధాన్యాలను వేయించారు. ఈ సందర్భంగా యూనిట్ రైతులంతా పూర్తిగా ఎరువుల అవసరం లేకుండా ప్రకృతి సేద్యంలో పంటలను పండించి మంచి దిగుబడులను పొందవచ్చు అని వివరించారు. గ్రామాల్లో పూర్తిగా ఈ నవధాన్యాలను రైతుల చేత వేయించే దిశగా పనిచేస్తున్నామని అన్నారు. అలాగే ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులంతా వరి వేసే పొలాల్లో తప్పకుండా ఈ 30 రకాల విత్తనాలను వేసుకుంటే ప్రధాన పంటకు కావాల్సిన అన్ని పోషకాలు సమృద్ధిగా అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో తిరుపతి, మల్లేష్, లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

కర్లెమ్మలో 'రాష్ట్రానికి ఇదేం కర్మ'

కొత్తూరు : మండలంలోని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఆధ్వర్యాన శనివారం రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. సంక్షేమం పేరుతో వైసిపి నాలుగేళ్లలో అన్నింటిపైనా భారాలు వేస్తూ... ప్రజల నడ్డివిస్తుందని ఆరోపించారు. ముందుగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాసునాయుడు, ఉప సర్పంచ్ పి.మణికంఠ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, ఎ.అరుణ్‌కుమార్, మాతల గాంధీ, ఎం.రాజారావు, వై.శ్రీను పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

రణస్థలం : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం జె.ఆర్.పురం పంచాయతీ సర్పంచ్ భవిరి రమణ, యువ నాయకులు పిన్నింటి సత్యంనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ ఆధ్వర్యాన రణస్థలంలో ఏర్పాటు చేసిన నాలుగు చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రం ప్రజలు దాహార్తిని తీర్చడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు, ప్రయాణికులకు ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో బ్రహ్మాజి, పాణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక మూడు రోడ్ల కూడలిలో విద్యావేత్త, పాతపట్నం నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ చలివేంద్రంలో స్వచ్ఛమైన తాగునీరు ఏర్పాటు చేశామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సరాలి సర్పంచ్ పడాలి షణ్ముఖరావు, లింగాల వెంకట కృష్ణారావు, మామిడి చిన్నబాబు, ఉపేంద్రరావు, శ్రీను, రాజారావు, రాజు పాల్గొన్నారు.

రణస్థలం : నీటిని అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

50 మంది రక్తదానం

శ్రీకాకుళం అర్బన్ : చేయిచేయి కలుపుదాం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన నగరంలోని న్యూ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబారాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. అనంతరం సంస్థ ప్రెసిడెంట్ సంతోష్, వినోద్ కుమార్‌లను అభినందించారు. కార్యక్రమంలో న్యూ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ కలిగట్ల చక్రవర్తి, జాడ సాయి, గురుగుబెల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న వాహనదారులు

మంచు కురిసే వేళలో...

పొందూరు: మండలంలో ఒక్కసారిగా శనివారం ఉదయం దట్టంగా కురిసిన మంచుతో ప్రయాణాలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శీతాకాలంలో ఏ విధంగా దట్టంగా మంచు కురుస్తుందో ఆ విధంగా ఒక్కసారిగా కురవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుంటూ నెమ్మదిగా ప్రయాణాలు సాగించారు. ఈ మంచు కారణంగా మామిడి, జీడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. గంటపాటు ఈ విధంగా దట్టంగా మంచు కురిసింది.

'జగనన్న మా భవిష్యత్'ను విజయవంతం చేయాలి

ఆమదాలవలస : జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని తొగరాంలో ఆయన కార్యాలయంలో వాలంటీర్లతో, గృహసారథులతో, కన్వీనర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని ఈ నెల 20 వరకు కొనసాగించాలని పిలుపునిచ్చారు. రోజూ ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై, సంక్షేమ పథకాలపై ఉన్న తేడాను ప్రజలకు వివరించాలని తెలిపారు. నియోజకవర్గంలో స్పీకర్ తమ్మినేని సీతారాం ఆధ్వర్యాన అభివృద్ధిలో ముందుకు దూసుకెళ్తుందన్నారు. అనంతరం సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ తమ్మినేని రమణమ్మ, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సామగ్రిని అందజేస్తున్న వేణుగోపాలరావు

ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

రోగికి ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు: మండలంలోని బెండికి చెందిన అల్లాడ మహాలక్ష్మి కేన్సర్ వ్యాధితో బాధపడుతుంది. బాధితురాలి దీనగాథ తెలుసుకున్న దాతలు స్పందిస్తూ ఆర్థికసాయం చేసేందుకు ముందుకొస్తున్నారు. ఇందులో భాగంగా సరుబుజ్జిలికి చెందిన ఆర్‌పి ఫౌండేషన్ వైద్య ఖర్చుల కోసం రూ.9 వేలు ఆర్థికసాయం శనివారం అందజేశారు. అలాగే గ్రామంలోని యువకులు రూ. 13 వేలు విరాళాలు సేకరించి అందించారు. ఆర్‌పి ఫౌండేషన్ చైర్మన్ బాలు, సభ్యులు వెంకటరమణ, దాలిరాజు, రామశంకర్, రవి, ఉద్దానం హెల్పింగ్ సొసైటీ, మైటీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఇచ్ఛాపురం: వివిఎం ఫౌండేషన్ చైర్మన్ వజ్రపు వెంకటేష్, తన సోదరులు లక్ష్మణరావు, సతీష్‌లు కలిసి తన తండ్రి నరసింహమూర్తి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని దాసన్నపేటలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు జి.ఎస్.స్వరూప, ప్రణీత, రాంబాబు, శ్రావ్యలు 370 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం 45 మందికి మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. శిబిరంలో మేనేజర్ శ్రీధర్, పిఆర్‌ఒ సంతోష్‌కుమార్, ప్రసాద్‌దేవినాయుడు, భవాని, దీప పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

పెన్షనర్ల ఆద్యుడు 'నకారా'

శ్రీకాకుళం అర్బన్ : విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ల ఆద్యుడు డి.ఎస్.నకారా 106వ జయంతి వేడుకలు రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నగరంలోని శాంత కళ్యాణ అనురాగ నిలయంలో శనివారం నిర్వహించారు. ముందుగా నగారా చిత్రపటానికి రెడ్‌క్రాస్ చైర్మన్ జి.జగన్మోహనరావు, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు బి.మల్లేశ్వరరావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకారా 1980లో సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసి 1987 డిసెంబరు 17న పెన్షన్‌ను సాధించారన్నారు. ఆనాటి నుంచి పెన్షన్ అనేది ప్రభుత్వ భిక్ష కానే కాదని, ఉద్యోగుల హక్కని నిరూపించారని అన్నారు. ఎం.ఎస్.ఆర్.ఎస్.ప్రకాశరావు, నరసింహమూర్తి, కార్యదర్శి కె.సోమసుందరరావు, పి.ఎస్.ప్రసాదరావు, బి.జయలక్ష్మి, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభాగ్యునికి రాజేష్ అండ

కవిటి: కవిటికి చెందిన అభాగ్యుడు వంకాయల పురుషోత్తంకు జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ అండగా నిలిచారు. పురుషోత్తం భార్య ఇటీవల మృతి చెందడంతో ఒంటరివాడైన పురుషోత్తం ప్రస్తుతం అనారోగ్యానికి గురై నడవలేని స్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న రాజేష్ పురుషోత్తంకు మూడు పూటలా భోజనం పెట్టమని స్థానిక హోటల్ యజమానికి నెలకు సరిపడే నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే దయనీయ స్థితిలో ఉన్న పురుషోత్తంను దాతలు ఉదారంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జన సైనికులు పండి పృథ్వీ, కాళీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లు అర్జున్ జన్మదినం

శ్రీకాకుళం అర్బన్ : తన అభిమాన నటుడు పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట నాగరాజు ఆధ్వర్యాన శనివారం నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘాల నాయకులు తైక్వాండో శ్రీను, వైశ్యరాజు మోహన్, అల్లు అర్జున్ ఫ్యాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు నవీన్, భాను, తాళాడ శేఖర్, అర్జున్ యలమంచిలి (బన్ని), గిరి, పవన్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలో అల్లు అర్జున్ జన్మదిన వేడుకలను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అలాగే పట్టణంలోని పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. అనంతరం ఫైఓవర్ కూడలి నుంచి కృష్ణాపురం కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అల్లు అర్జున్ యూత్ బగాది నేతాజీ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : కేక్‌ను కట్ చేస్తున్న అభిమానులు

నేడు శిక్షణ

పలాస : పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలు పరిధిలో ఉన్న విద్యా వాహిని డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఆర్థిక పరమైన అంశాలపై అవగాహన, శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బొనెల గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువతి, యువకులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సెక్యూరిటీస్, స్టాక్ చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా శిక్షకులైన డాక్టర్ బలరాం, టెక్కలి ఐతమ్ కళాశాల బృందం పాల్గొంటారని అన్నారు. సమాజంలో ఆర్థిక క్రమశిక్షణ, విద్య, దాని అవసరం కోసం వివరిస్తారని తెలిపారు.